# సాక్షి వికారాబాద్

శనివారం । 15 । ఏప్రిల్ । 2023





**పనులు ఆగమాగం..**

గడువు ముగుస్తుందన్న కారణంతో ఆగమాగం చేపట్టిన అభివృద్ధి పనుల్లో పలుచోట్ల నాణ్యత పాటించలేదు. 10లో▸




వికారాబాద్: మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో విజయ్‌కుమార్, శుభప్రద్, మంజుల




## న్యూస్‌రీల్

### రంజాన్ దీక్షలతో స్వీయ క్రమశిక్షణ



దోమలో ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లిం మహిళలు

దోమ: రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలు పాటించడం వలన స్వీయ క్రమశిక్షణ, భక్తిభావాలు అలవడుతాయని జిల్లా గ్రంథాయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్ అన్నారు. ఎంపీపీ అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు అనితగౌడ్‌తో కలిసి మండల కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాస దీక్షలో ఉన్న వారికి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ గౌస్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, గ్రామస్తులు బంగ్ల వెంకటయ్య, కోట్ల యాదగిరిగౌడ్, అభిగౌడ్, ముస్తాఫా, కమ్మర్, వాజిద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

### అసమర్థ పాలనను ఎండగడదాం

'ఇంటింటికి బీజేపీ'లో నేతలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాంరెడ్డి, నాయకులు

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ అవినీతి, అసమర్థ పాలనను ప్రజల్లో ఎండ గట్టాలని బీజేపీ ఫిలింబోర్డు రాష్ట్ర సెన్సార్ మాజీ సభ్యుడు తిప్పిరెడ్డి రాంరెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. జాతీయ ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ పిలుపు మేరకు ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ బక్కి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పల్లె పల్లెకు ఓబీసీ-ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్, కార్యవర్గ సభ్యులు మల్లేశ్, జంగయ్య, మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అనిల్, సుదర్శన్, హరికాంత్, మహేశ్, ఉప సర్పంచ్ అనిల్, పరమేష్, కుమార్ పాల్గొన్నారు.

### హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

పహాడీషరీఫ్: భూ కబ్జా కోసం యువకుడిని హత్య చేసేందుకు యత్నించిన ఐదుగురిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెరువు కట్ట దిగువన ఉన్న కాలనీలో ఉప్పుగూడ రక్షాపురం కాలనీకి చెందిన నేనావత్ రాజుకు 60 గజాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన తన బంధువు కేతావత్ మహేష్‌నాయక్‌తో కలిసి ఈ నెల 9న ఉదయం ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. లంచ్ తెస్తానంటూ వెళ్లిన మహేశ్ రాకపోవడంతో మధ్యాహ్నం భోజనం కోసం రాజు హోటల్‌కు వెళ్తుండగా ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా రాజును అడ్డుకున్న శ్రీరాం కాలనీకి చెందిన బుడిగపాటి అనిల్ కుమార్(24) ఎందుకు ఇళ్లు కడుతున్నారంటూ ఆగ్రహంతో తన స్నేహితులు అజయ్ (22), రోహిత్ పాల్(20), పడిగ సాయిరెడ్డి(19), మహ్మద్ సమీర్(19) లతో కలిసి ఇనుప రాడ్‌తో దాడి కొట్టి కత్తితో దాడి చేస్తుండగా.. అడ్డుకున్న బాధితుడు వారినుంచి తప్పించుకుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# జై భీమ్..

జిల్లాలో జై భీమ్ నినాదాలు మార్మోగాయి. బాబాసాహెబ్ జెండాలు రెపరెలాడాయి. సకల జనుల జయజయ ధ్వానాల నడుమ అంబేడ్కర్ జయంతి వేడుకలు మిన్నంటాయి. అభిమానులు అలంకరించిన పూలమాలలతో 'భారతరత్న' విగ్రహాలన్నీ పుష్ప శోభితమయ్యాయి.

- రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళి
- వాడవాడలా హోరెత్తిన జయంతి వేడుకలు
- అంబేడ్కర్ సేవలను కొనియాడిన కలెక్టర్, నేతలు



తాండూరు: పట్టణంలో అంబేడ్కర్ జయంత్యుత్సవ ర్యాలీ, పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



దోమ: అంబేడ్కర్ వేషధారణలో బాలుడు

వికారాబాద్: సమ సమాజ స్థాపనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. వికారాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన బాబాసాహెబ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులతో కలిసి రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా సమాజంలోని అసమానతలు రూపుమాసాయని తెలిపారు. మహిళలు, చిన్నారులకు హక్కులు సిద్ధించాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కొనియాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ ఏనాడో చెప్పారని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ఆర్థిక అభ్యున్నతి సాధించాలని దళిత, గిరిజనులకు సూచించారు. ప్రతిఒక్కరూ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

**బలహీనవర్గాల ఆశాజ్యోతి**

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కీర్తించారు. ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాలను ఏర్పాటు చేసి దళిత, గిరిజన బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతోందని తెలిపారు.

**హక్కుల సాధన యోధుడు**

జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తన చివరి శ్వాస వరకూ సమానత్వం కోసం పోరాడిన ధీరుడు అంబేడ్కర్ అన్నారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా కొనసాగుతూ మహిళల హక్కుల కోసం పార్లమెంటులో ప్రవేశపెట్టిన హిందూకోడ్ బిల్లును ఆమోదించకపోవటంతో తన పదవికి రాజీనామా చేసి నిబద్ధత చాటుకున్నారని గుర్తుచేశారు. అంతకు ముందు అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనంద్, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, అడిషనల్ ఎస్పీ మురళీధర్, ఆర్డీఓ విజయకుమారి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, బీసీ సంక్షేమాధికారి ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

# పాలమూరుపై నీలినీడలు

కరువు కాటకాలు, వలసలతో జీవకళ కోల్పోయిన పాలమూరు జిల్లాకు.. సాగు నీటి వనరులు లేని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా నది నుంచి సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు బీజం వేశారు. 2015 జూన్ 11న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఎనిమిదేళ్లుగా ఇందుకు సంబంధించిన పనులు పూర్తి కావడం లేదు. దక్షిణ తెలంగాణలోని ఎత్తిపోతల పనులను ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ పురోగతిలో మందగమనంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనికితోడు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర జలసంఘం కొత్తగా మరో కొర్రీ పెట్టింది.

**ప్రాజెక్టు అనుమతులపై కేంద్ర జల సంఘం కొర్రీ**

- డీపీఆర్‌ను సవరించలేమని మోకాలడ్డు
- జిల్లా రైతుల్లో మళ్లీ ఆందోళన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని అభ్యర్థన



నిర్మాణ పనులు కొనసాగుతున్న కరివెన రిజర్వాయర్

కొడంగల్: పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అనే చందంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వలేమని కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ఈ మేరకు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు కేంద్ర జల సంఘం డైరెక్టర్ నిత్యానంద ముఖర్జీ లేఖ రాశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సవరించలేమని తిప్పి పంపారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజులకు 90 టీఎంసీల నీటిని తరలించే విధంగా తెలంగాణ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. కృష్ణా మిగులు జలాల్లో 45 టీఎంసీలతో పాటు మరో 45 టీఎంసీల నీటిని ఎత్తిపోతలకు కేటాయిస్తూ ప్రాజెక్టు సమగ్ర రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర జల సంఘానికి సమర్పించింది. ఈ నివేదికపై సంతృప్తి చెందని కేంద్ర జల సంఘం అనుమతులు ఇవ్వలేమని చెప్పింది. నీటి కేటాయింపులపై స్పష్టత లేనందున డీపీఆర్‌ను మదింపు చేయలేమని జల సంఘం అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టుకు కేటాయించిన నీటిలో రెండు తెలుగు రాష్ట్రాల వాటా ఉన్నందున తాము నిర్ణయం తీసుకోలేకపోన్నామని పేర్కొన్నారు. దీంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**నిర్మాణంలో రిజర్వాయర్లు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ప్రస్తుత వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని బీడు భూములకు సాగు నీరు అందించాలనేది ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్ల నుంచి నీటిని తరలించే విధంగా పనులు చేపట్టారు. అవసరమైన రిజర్వాయర్లను సైతం నిర్మిస్తున్నారు. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. గ్రావిటీ ద్వారా చెరువులను నింపి అక్కడి నుంచి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సి ఉంది. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు లక్ష్మీదేవిపల్లి, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల నుంచి సాగునీరు సరఫరా చేయడానికి సర్వే చేశారు.

**అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే**

సాగునీరు లేకపోవడంతో కొడంగల్‌లో పంటలు పండటం లేదని స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ నియోజకవర్గంలో 2.19 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నప్పటికీ రైతుల బతుకులు బాగు పడటం లేదన్నారు. కొడంగల్, దౌల్తాబాద్, మద్దూరు మండలాల్లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న సుమారు 40 గ్రామాలకు పాలమూరు పథకం ద్వారా సాగునీరు అందించే అవకాశం లేదని తెలిపారు. ప్రత్యేక డిజైన్ ద్వారా ఆయా గ్రామాలకు సైతం సాగునీరు అందేలా చూడాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఎత్తిపోతలతోనే సాగునీరు**



కొడంగల్ నియోజకవర్గానికి సాగు నీరందించేలా ప్రభుత్వం కృషిచేయాలి. కాల్వల నీళ్లు వస్తే కానీ పంటలు పండే పరిస్థితి లేదు. బోరుమోటార్ల కింద వ్యవసాయం కష్టంగా ఉంది. చేతికొచ్చిన పంటలు చివరి దశలో ఎండిపోతున్నాయి. సాగు నీరు ఇస్తేనే రైతులు బాగుపడుతారు.

– సత్యమ్మ, మహిళా రైతు, పర్సాపూర్

**నీళ్లొస్తేనే మేలు**



పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఇక్కడి ప్రాంత రైతులకు సాగునీరందించాలి. ఎన్నో ఏళ్లుగా నీళ్ల వస్తాయని చెబుతున్నా ఇప్పటివరకు అతీగతీ లేకుండా పోయింది. వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాధార పంటలు సరిగ్గా పండటం లేదు. సాగు నీరువస్తే మేలు జరుగుతుంది.

– బాకారం సాయిలు, రైతు కొడంగల్

# రహదారిపై రక్షణ కవచం

- జాతీయ రహదారిపై 'ఎస్‌ఓఎస్'
- వాహనదారుల కోసం ఫోన్ సౌకర్యం
- కాల్ చేస్తే తక్షణ సేవలు
- ఆపద సమయంలో అండగా..
- క్షతగాత్రులకు ప్రథమ చికిత్స
- సమీపంలోని ఆస్పత్రులకు తరలింపు



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్‌ఓఎస్ ఫోన్

కొత్తూరు: జాతీయ రహదారిపై ఆపద సమయంలో అండగా నిలుస్తోంది ఎస్ఓఎస్ (సేవ్ అవర్ సోల్) ఫోన్ సౌకర్యం. రోడ్డుపై ప్రయాణ సమయంలో వాహనదారులకు ఏదైనా ప్రమాదం తలెత్తినప్పుడు ఆపత్కాలంలో తక్షణ సేవలు అందిస్తోంది. విలువైన ప్రాణాలను రక్షిస్తోంది. అయితే చాలామందికి దీనిపై అవగాహన లేకపోవడంతో వినియోగించుకోలేకపోతున్నారు. దేశంలోనే అతిపెద్ద జాతీయ రహదారిగా పేరుగాంచిన ఎన్‌హెచ్ 44 కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది.నిత్యం ఈ రోడ్డుపై లక్షలాది వాహనాలు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి.తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయి.ప్రాణాపాయంలో క్షతగాత్రులను రక్షించేందుకు జాతీయ రహదారికి ఇరువైపులా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతి రెండు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఈ ఫోన్ సౌకర్యం కల్పించింది. జిల్లా పరిధిలోని తొండుపల్లి నుంచి బూర్గుల గేట్ వరకు ఎన్‌హెచ్ 44పై 36 ఎస్ఓఎస్ ఫోన్ కేంద్రాలు ఉన్నాయి.

**అవగాహన కరువు**

ఎన్‌హెచ్–44పై నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరగడం పరపాటిగా మారింది. దీనికి తోడు సుదూర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు మరమ్మతులకు గురవుతుంటాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు వెంటనే చికిత్స అందితే చాలా వరకు ప్రాణాలు కాపాడొచ్చు. సమయానికి పోలీసులు, బంధువులకు సమాచారం ఇచ్చేందుకు సకాలంలో ఎవరూ ముందుకురారు. క్షతగాత్రుల వద్ద ఫోన్లు ఉన్నప్పటికీ ప్రమాదాల కారణంగా అవి ధ్వంసమయ్యే అవకాశం ఉంటుంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించి క్షతగాత్రులకు వెంటనే సహాయం చేయడానికి ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్‌హెచ్‌ఏఐ ఎస్ఓఎస్ ఫోన్లను అందుబాటులో ఉంచింది. చాలామంది వాహనదారులకు ఎస్ఓఎస్ ఫోన్లపై అవగాహన లేక ఇతరుల సహాయం కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

**మీట నొక్కితే చాలు**

- సహాయం కోరుకునే వాహనదారులు ఎస్ఓఎస్ ఫోన్‌కు ఏర్పాటు చేసిన మీట (బటన్) నొక్కి వివరాలు చెబితే సరి.
- వెంటనే సమాచారం సమీపంలోని రోడ్డు నిర్వహణ చూసే కంట్రోల్ రూంకి వెళ్లి వారి లొకేషన్ కూడా తెలుస్తుంది.
- రోడ్డు నిర్వహణ అధికారులు తక్షణమే అంబులెన్స్‌తో బాధితుల వద్దకు చేరుకుంటారు.
- బాధితులకు అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి సమీపంలోని ఆస్పత్రులకు తరలిస్తారు.
- భారీ వాహనాలు రాకపోకల సమయంలో మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచి పోతుంటాయి. అలాంటప్పుడు డ్రైవర్లు తమ సమస్యను ఎస్ఓఎస్ ద్వార తెలిపితే రోడ్డు నిర్వాహణ చూసే అధికారులు వెంటనే క్రేన్ల సాయంతో వాహనాలను పక్కకు తొలగిస్తారు.
- అటవీ ప్రాంతాల్లో వాహనాలు మరమ్మతులకు గురికావడం.. ఇంధనం అయిపోవడం జరిగితే పెట్రోలింగ్ వాహనం ఇంధనాన్ని సైతం సమకూర్చుతుంది.

**అవగాహన కల్పించాలి**



ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఎస్ఓఎస్ ఫోన్ల వినియోగంపై సాధారణ ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందితే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

– గాలిగూడెం మహేందర్, తిమ్మాపూర్

# భద్రేశ్వర వైభవం



భద్రేశ్వరస్వామి పల్లకీ సేవలో భక్తులు

తాండూరులోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పుష్పార్చన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి 8గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవ నిర్వహించారు. భద్రేశ్వరుడిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పురంతయ్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– తాండూరు టౌన్



పురంతయ్యల విన్యాసాలు

## క్లుప్తంగా

### బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

యాలాల: బావిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన యాలాల శివారులో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సాయిలు(24) మూడేళ్ల క్రితం పెద్దేముల్‌ మండలం గొట్లపల్లికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాది క్రితం భార్యను వదిలేసి యాలాలలో ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



సామూహిక హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

ధారూరు: మండల పరిధిలోని డీకేతండాలో శుక్రవారం అంబా భవానీమాత, మరియమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లకు సుప్రభాతసేవ చేశారు. తర్వాత అభిషేకాలు, అలంకరణ అనంతరం దీపారాధన చేశారు. ధ్వజారోహణం తర్వాత పుణ్యాహవచనం, మాతృకానందీ, గౌరీపూజ, ముఖ్య దేవత నవగ్రహ పూజలు, అగ్నిప్రతిష్ఠ చేశారు. అనంతరం సామూహిక హోమాలు కొనసాగించారు. హోమాల అనంతరం అమ్మవార్లకు మంగళ హారతి ఇచ్చి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌ 4వ వార్షికోత్సవ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### నిందితుల రిమాండ్‌

అనంతగిరి: ఇల్లును తమ పేరుపై రిజిస్ట్రేషన్‌ చేయడం లేదని వికారాబాద్‌లో తండ్రిని హత్య చేసిన కొడుకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శీను తెలిపారు. ఇద్దరు కుమారులను పట్టణంలోని రామయ్యగూడలో శుక్రవారం అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం

కద్లాల్‌: హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌ చిత్రపటంతో పాటు, అంబేడ్కర్‌ చిత్రపటాలకు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ వెంకటేశ్‌, వైస్‌ ఎంపీపీ ఆనంద్‌, ఉప సర్పంచ్‌ రామకృష్ణ, రైతుబంధు మండల కోఆర్డినేటర్‌ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# పనులు ఆగమాగం.. రోడ్లు నాసిరకం

**నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు**

- క్యూరింగ్‌ చేయకున్నా చేసినట్లు రికార్డులు
- పగుళ్లతో దర్శనమిస్తున్న సీసీ దారులు
- ఆన్‌లైన్‌లో పూర్తయిన ఎంబీలు



ఇటీవల ఈర్లపల్లిలో వేసిన సీసీ రోడ్డు

దౌల్తాబాద్‌: గడువు ముగుస్తుందన్న కారణంతో రహదారుల నిర్మాణం ఆగమాగం చేపట్టడం.. నాణ్యత పాటించకపోవడంతో పనులన్నీ మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. మండలంలో 33 గ్రామపంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నుంచి రూ.3కోట్లు మంజూరయ్యాయి. వీటిని 33 పనుల్లో రోడ్లుగా విభజించి గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. ఇందులో 33 పనులు పూర్తయ్యాయి. పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని గడువు విధించారు. అయితే ఈ పనులు మార్చి చివరి వారంలో ఆగమేఘాల మీద చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్‌ అధికారులు పనులను పరిశీలించి నాసిరకం ఉన్న రోడ్లకు సంబంధించి ఏ మేరకు రికవరీ చేస్తారో వేచి చూడాలి.

**పూర్తయిన ఆన్‌లైన్‌ ఎఫ్‌టీవో..**

మార్చి చివరి వారంలో మంజూరైన సీసీ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఆగమేఘాల మీద కాంట్రాక్టర్లు చేపట్టారు. ఒక దశలో మిల్లర్‌, కంకర కొరత ఏర్పడింది. సీసీ రోడ్ల పనుల్లో గుత్తేదారులు డస్ట్‌ మోతాదుకు మించి మట్టితో కూడిన ఇసుకను వాడారు. అంతేకాకుండా రోడ్డు పూర్తయిన తర్వాత క్యూరింగ్‌ చేయకుండానే ముగించారు. ఎక్కడ కూడా మార్జిన్‌కు ఇరువైపులా మొరం పోయలేదు. 31లోపు పనులు పూర్తి చేయాలని చెప్పి ఆన్‌లైన్‌ ఎఫ్‌టీవోను 29నే క్లోజ్‌ చేశారు. నాణ్యత పాటించకపోయినా ఎంబీలు, ఆన్‌లైన్‌ ఎఫ్‌టీఓను కూడా అధికారులు పూర్తి చేశారు. కాగా ఇదే విషయమై పంచాయతీరాజ్‌ ఏఈ కిరణ్‌ను వివరణ కోరగా నాణ్యతతో సీసీ రోడ్ల పనులు చేసేలా చర్యలు చేపట్టామని మార్జిన్‌కు ఇరువైపులా వేసే మట్టి బిల్లు చేయలేదన్నారు.

**అందినకాడికి కమీషన్లు..**

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ద్వారా చేపట్టిన 33 పనుల బాధ్యతలను సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, చోటామోటా గ్రామస్థాయి లీడర్లకు అప్పగించారు. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నలుగురైదుగురు ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. చాలా పనులను కమీషన్లు తీసకుంటూ వారికి పనులు అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందినకాడికి కమీషన్లు దండుకుంటూ రోడ్ల పనుల నాణ్యతను విస్మరించారు. 5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీరాజ్‌ ఏఈ మూడు మండలాలకు ఒక్కరే కావడంతో రోడ్ల నాణ్యత పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు గ్రామాల్లో తాజాగా వేసిన రోడ్లు పగుళ్లు ఏర్పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఈతకు వెళ్లి బావిలో మునక



బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

పెద్దేముల్‌: ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం పెద్దేముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్‌ గ్రామానికి చెందిన బోయిని పెద్ద మొగులప్ప పొలం వద్ద నూతనంగా పీర్లు (దేవాలయం) ఏర్పాటు చేయడంతోపాటు కందూరు చేశారు. పెద్దేముల్‌ గ్రామానికి చెందిన బోయిని వెంకటయ్య అల్లుడు, దారూర్‌ మండలానికి చెందిన తిరుపతి శ్రీనివాస్‌(36) దావత్‌ (కందూరు)కు వచ్చి బావిలో ఇతకు వెళ్లి మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పోలీస్‌ సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని తాండూరు మార్చురికి తరలించారు. ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

# గాలివాన బీభత్సం

**నేలకొరిగిన పంట చేలు**

- దెబ్బతిన్న ఇళ్ల పైకప్పులు



తలకొండపల్లి–పడకల్‌ రహదారిపై కూలిన వృక్షం

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌, హార్యనాయక్‌తండా, వెంకటాపూర్‌, తుమ్మలకుంటతండా, పెద్దూర్‌తండా తదితర గ్రామాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. చేలు నేలకొరిగి పంటలు దెబ్బతిన్నాయి. పడకల్‌–తలకొండపల్లి మధ్యలో చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జొన్న, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఇతర కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. సుమారుగా 15 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు రైతులు చెప్పారు.

**రేకుల ఇల్లు ధ్వంసం**

తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్‌లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన అమృత రేకుల ఇల్లు ధ్వంసమైంది. ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. మరికొన్ని ధ్వంసమయ్యాయి. డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

# ప్లాటు విషయమై ఘర్షణ

**భాగస్వామిపై ఇనుప రాడుతో దాడి**

మీర్‌పేట: ప్లాటు విషయమై ఇద్దరు భాగస్వాముల మధ్య గొడవ జరగడంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాదర్‌గుల్‌కు చెందిన కొమురయ్య యాదవ్‌, బడంగ్‌పేట వసంతవిహార్‌ కాలనీకి చెందిన రాధిక రియల్‌ఎస్టేట్‌ వ్యాపారంలో భాగస్వాములు. ఎంవీఎస్‌ఆర్‌ కళాశాల వద్ద గతంలో ఇద్దరు కలిసి ఒక ప్లాటును కొనుగోలు చేశారు. ఈ ప్లాటును అమ్మే విషయమై మాట్లాడుదామని కొమురయ్య గురువారం రాత్రి రాధికకు ఫోన్‌ చేసి బడంగ్‌పేటలోని కార్యాలయానికి పిలిచారు. ప్లాటు విషయంలో ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి గొడవ జరగడంతో కొమురయ్య బండరాయి, ఇనుప రాడుతో రాధికపై దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే అక్కడికి చేరుకున్న రాధిక కుమారుడు భరత్‌ చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. నిందితుడు కొమురయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

# అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



కొడంగల్‌: అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ సిబ్బంది



తాండూరు: పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడంగల్‌: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని అగ్ని మాపక సిబ్బంది కోరారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌ యార్డులోని అగ్నిమాపక కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలను చైతన్యం చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగి ఆస్తి నష్టం జరగక ముందే అప్రమత్తం కావాలన్నారు. 101 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లలో తగిన చర్యలు తీసుకొని ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అగ్ని ప్రమాదాల్లో గాయపడి చనిపోయిన ఉద్యోగుల ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. 1944 ఏప్రిల్‌ 14న ముంబయిలో జరిగిన ప్రమాదంలో 66 మంది ఉద్యోగులు చనిపోయారని గుర్తు చేశారు. వారి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కొడంగల్‌ అగ్నిమాపక కేంద్రం ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

**సిబ్బంది కవాతు..**

తాండూరు: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్టేషన్‌ అగ్నిమాపక శాఖ అధికారి నాగార్జున కార్యాలయ ఎదుట సిబ్బంది కవాతు నిర్వహించారు. అగ్నిమాపక శాఖ జెండాను నాగార్జున ఆవిష్కరించారు. అనంతరం స్థానికులకు ప్రమాదాలు జరిగితే నివారించేందుకు ఉపయోగించే పరికరాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారోత్సవాలలో ప్రజలకు వారం రోజుల పాటు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. భారీ భవనాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, కార్యాలయాలలో ఫైర్‌ సెఫ్టీ పాటిస్తున్నారా లేదా అనే దానిపై తనిఖీలు చేపడతామన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే టోల్‌ ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోపాల్‌, జలంధర్‌, ఖాజా, అమర్‌నాథ్‌రెడ్డి, సునిల్‌ కుమార్‌, సంతోష్‌ తదితరులున్నారు.

# ముస్లింల సంక్షేమానికి కృషి



ఇఫ్తార్‌ విందులో పండును తినిపిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కేసీఆర్‌ ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎంఎం గార్డెన్‌లో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్‌ విందును ప్రభుత్వం తరపున ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి పలు పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నదన్నారు. అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటచారి, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కప్పరి స్రవంతి, తహసీల్దార్‌ రామ్మోహన్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు క్యామ మల్లేశ్‌, మహేశ్‌గౌడ్‌, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

# గువ్వకు గూడునిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

**నీరు, ఆహారంలేక అంతరిస్తున్న పక్షిజాతులు**

- మరోవైపు కాటేస్తున్న కాలుష్యం
- రేడియేషన్‌తో పొంచిఉన్న ముప్పు
- పక్షుల ఆకలిదప్పికను తీరుస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం
- అవగాహన కల్పిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న సభ్యులు




పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు (ఫైల్‌)





పంపిణీకి సిద్ధంగా ఉంచిన పిచ్చుక గూళ్లు, నీటి తొట్లు, గింజలు

హుడాకాంప్లెక్స్‌: మనుషుల మధ్య అంతరాలు పెరిగితే వచ్చే కష్టం కన్నా.. ప్రకృతిలోని జీవులకు హాని కలిగితే జరిగే నష్టం అపారం. ఈ నష్టాన్ని కొత్తపేటలోని జాగృతి అభ్యుదయ సంఘం ముందే గుర్తించింది. కాంక్రీట్‌ అరణ్యంలో వాటికి ఓ గూడును ఏర్పాటు చేయడంతో పాటు ఆకలి, దప్పికలను తీరుస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తోంది. పిచ్చుక గూళ్లు, నీటి తొట్లను, గింజలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అంతరించిపోతున్న పక్షి జాతి పరిరక్షణపై అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్నారు.

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో..**

ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. సూర్యుని వేడిమి ధాటికి పశుపక్షాదులు విలవిల్లాడుతున్నాయి. చెరువులు, కుంటలు మాయమై..పంట పొలాలు ధ్వంసమై..నిలువ నీడ లేక పోవడంతో చెల్లాచెదురయ్యాయి. ఎత్తయిన భవనాల సముదాయాల మధ్య ఎటు వెళ్లాలో అర్థం కాక ఆకలితో అలమటించి చివరకు మృత్యువాతపడుతున్నాయి. దీనికి తోడు సెల్‌ ఫోన్‌ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్‌ పెద్ద ముప్పుగా మారింది. వాహన కాలుష్యానికి తోడు పారిశ్రామిక కాలుష్యం వాటి ఉనికిని దెబ్బతీస్తుంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 1300 రకాల పక్షి జాతులు ఉండగా, వీటిలో తెలంగాణలో 446 రకాల పక్షి జాతులు మాత్రమే ఉన్నట్లు అంచనా. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పక్షుల ఉనికి పూర్తిగా కనుమరగయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పులి, సింహాలను జూలో చూసినట్లు..కొద్ది రోజుల తర్వాత పక్షులను చూడాల్సి వస్తుందని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### కలుషితం కావడంతోనే..



- నాలుగు దశాబ్దాల క్రితం వరకు జిల్లాలోని పలు జలాశయాల్లో , చెరువు, మూసి పరీవాహక ప్రాంతాల్లో ఎన్నో రకాల చేపలు దొరికేవి. నేడు చెరువులు, కుంటలు పూర్తిగా మాయమయ్యాయి. జలాశయాలు కలుషితమవడంతో చేపలు లేకుండా పోయాయి. ఆహారం లభించకుండా పోయింది.
- జిల్లాలో కాయకూరలు, పండ్ల తోటలు, సజ్జలు, రాగులు, జొన్నలు వంటి తృణ ధాన్యాల సాగు ఎక్కువగా ఉండేది. ఆయా పంట చేలపై వచ్చే పురుగులను ఆహారంగా తీసుకుని పక్షులు జీవించేవి. చీడపీడల సమస్య కూడా తొలగిపోయేది. ప్రస్తుతం రియల్‌ ఎస్టేట్‌ కారణంగా ఆయా తోటలు ధ్వంసమయ్యాయి. చెట్లను నరికివేయడంతో పక్షులకు నిలువనీడ లేకుండా పోయింది.
- సాధారణంగా పక్షులు విశాలమైన చెరువులు, కుంటల్లో నీళ్లను తాగేందుకు ఇష్టపడుతుంటాయి. బోరుబావులున్నా.. వీటిపై పెద్దగా ఆసక్తి చూపవు. చెరువులు, కుంటలు ఎండిపోవడం, ఉన్నవి కూడా రసాయనాలతో పూర్తిగా కలుషితమవడంతో ఆ నీటిని తాగి పక్షులు చనిపోతున్నాయి.
- శివారు ప్రాంతాల్లో పక్షుల వేట కూడా ఎక్కువైంది. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉచ్చులు అమర్చి..వాటిని అంతమొందిస్తున్నారు. జిల్లాలో పక్షుల జాతి అంతరించిపోతుండటానికి ఇదీ కూడా ఓ కారణం.

### మనల్ని మనం కాపాడుకున్నట్లే..



ప్రకృతిని పరిరక్షించడమేంటే.. మనల్ని మన భవిష్యత్తు తరాలను రక్షించడమే. జీవావరణ వ్యవస్థలో ఆహారపు గొలుసు ఉంది. ప్రతి జీవి మరోదానిపై ఆధారపడి మనుగడ సాగిస్తుంది. పక్షులు మనకు హాని చేసే క్రిమికీటకాలను తిని పరిసరాలు కలుషితం కాకుండా చూస్తాయి. పండ్లు తిని గింజలను పడేయడంతో ఆ విత్తనాలు చెట్లై మనకు ప్రాణవాయువును ఇస్తాయి. చెట్ల ఫలాలను తిని ఆకాశంలో ఎగురుతూ రెట్ట వేస్తాయి. దాని వల్ల అక్కడ చెట్లు మొలుస్తాయి. నదులు, సముద్రాలపై విహరిస్తూ రెట్ట వేసినప్పుడు అక్కడ ఆల్గే (పచ్చని నాచు) పెరుగు తుంది. ఆ నాచును ఏకకణ సూక్ష్మజీవులు తింటాయి. దాన్ని చేపలు సహా మరోరకం జీవులు భుజిస్తాయి. ఈ చేపలు మనుషులకు ఆహారంగా మారతాయి.

– భావన శ్రీనివాస్‌, జాగృతి అభ్యుదయ సంఘం

### మొక్కలను పెంచాలి



బాల్కానీలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లపై అన్నం మెతుకులు, తృణ ధాన్యాలు చల్లాలి. పక్షులు పండ్లను తింటాయి. వాటి ఆవాసాలు ఎక్కువగా చెట్లే. వాటికి ఆహారాన్నిచ్చే మర్రి, వేప, రావి, నేరేడు వంటి చెట్లను పార్కుల్లో పెంచాలి. ఇళ్లు అపార్ట్‌మెంట్లలో కొంత స్థలంలోనైనా మొక్కలను పెంచాలి. సీతాకొక చిలుకలు, తేనేటీగలు ఆకర్షితమవుతాయి. పురుగులు, క్రిమి కీటకాలు వచ్చినా.. వాటిని పక్షులు తింటాయి. బాల్కానీలు, ఇళ్లపై నీటి తొట్లు, ఆహారం ఏర్పాటు చేయడం ద్వారా పక్షులను పరిరక్షించుకోవచ్చు. ఒకప్పుడు ఇళ్లకు వెంటిలేటర్లు ఉండేవి. గాలి ఎక్కువగా వచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసుకునేవారు.

– ఇస్మాయిల్‌, యోగ గురువు

### బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

షాద్‌నగర్‌ రూరల్‌: ఖమ్మంలో ఇటీవల బీఆర్‌ఎస్‌ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బాణసంచా పేలి చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్‌ఎస్‌ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో బాణసంచా ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కోటి చొప్పున పరిహారం ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, గాయపడిన వారికి రూ. 50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ ఘటనకు కారకులైన ఎమ్మెల్యే, ఎంపీలపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాంప్రసాద్‌, నర్సింలు, పసుపుల శ్రీకాంత్‌, మోజస్‌, రాజేష్‌చౌహాన్‌, ఉదయ్‌కృష్ణ, శ్రీను, లింగారం కృష్ణయ్య, శంకరయ్య, రాంచందర్‌, రాందాస్‌ పాల్గొన్నారు.

### పిడుగుపాటుతో ఆవు మృతి



కేశంపేట: పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సుందరపూరం శివారులోని పుణ్యతండాలో చోటుచేసుకుంది. పుణ్యతండాకు చెందిన నేనావత్‌ అమృత పాడి ఆవుపై అధారపడి కుటుంబం జీవిస్తోంది. గురువారం రాత్రి పిడుగుపడి పాడి ఆవు మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. అదెరువు కోల్పోయిన మహిళా రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.